04112024-DIS-16_Layout 1 11/4/2024 3:47 AM Page 1



# మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌కు బిల్లు !

- **వినియోగదారుల నుంచి నెలకు రూ. 200 వసూలుకు మున్సిపల్ చర్యలు**
- **ఆందోళనలో మెట్‌పల్లి పట్టణవాసులు**



పట్టణంలో మిషన్ భగీరథ నల్లాను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

మెట్‌పల్లి, నవంబర్ 3: ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరందించాలనే సదాశయంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఇంటింటికీ ఉచితంగా నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసింది. నల్లా కనెక్షన్ల నిర్వహణ బాధ్యతలను 2021–22లో మున్సిపల్‌కు మిషన్ భగీరథ విభాగం అప్పగించింది. అప్పటి నుంచి మంచినీటి సరఫరా తీరును మున్సిపల్ యంత్రాంగం పర్యవేక్షిస్తున్నది. ఇప్పటి వరకు నల్లా కనెక్షన్ బిల్లు వసూలు చేయలేదు. కాగా, కొత్త ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నది. తాజాగా మున్సిపల్ అధికార యంత్రాంగం నల్లా కనెక్షన్ బిల్లుల వసూళ్లకు కార్యాచరణ చేపట్టింది. నల్లా కనెక్షన్ అమర్చిన నుంచి నెలవారీగా పేరుకపోయిన బిల్లులు కట్టాల్సిందేనని తెలియడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నల్లా కనెక్షన్‌కు నెలకు రూ. 200 వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో మెట్‌పల్లి పట్టణంలోని 26 వార్డుల్లో ఒక్కో వార్డుకు ఇద్దరి చొప్పున మున్సిపల్ సిబ్బందిని కేటాయించగా, ఇంటింటికీ వెళ్లి నల్లా కనెక్షన్, ఇంటి యజమాని, నీటి సరఫరా తీరు వివరాలను సేకరిస్తున్నారు. ఒక్క నల్లా కనెక్షన్‌కు నెలకు రూ. 200 చొప్పున అంటే సంవత్సరానికి రూ. 2400 వినియోగదారు కట్టాల్సి ఉంటుంది. పట్టణ వ్యాప్తంగా ప్రస్తుతం మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సంఖ్య 11584 ఉండగా ఈ లెక్కన మున్సిపల్‌కు సంవత్సరానికి రూ. లక్షల్లో ఆదాయం సమకూరనుంది. మరోవైపు నల్లా కనెక్షన్‌కు నెలకు రూ. 200కు బదులు రూ. 100 నిర్ణయించాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నది. మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. కాగా, ఈ విషయమై మున్సిపల్ డీఈఈ నాగేశ్వర్‌రావును వివరణ కోరగా ఇంటింటా నల్లా కనెక్షన్ల సర్వే కొనసాగుతున్నదని తెలిపారు. మిషన్ భగీరథ పథకానికి సంబంధించి 11584 నల్లా కనెక్షన్లు తమకు అప్పగించడం జరిగిందన్నారు. మిషన్ భగీరథలో అమర్చిన కనెక్షన్లలో ఎన్ని వినియోగంలో ఉన్నవి, లేని వాటి వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. సేకరించిన నల్లా కనెక్షన్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఒక్కో నల్లా కనెక్షన్‌కు నెలకు రూ. 200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2021–22 నుంచి బకాయిలను వసూలు చేస్తామని పేర్కొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం




సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

సారంగాపూర్, నవంబర్ 3: కాంగ్రెస్ రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ పేర్కొన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ బలోపేతంపై సమీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రజల పక్షాన పోరాటం చేయాలని నిర్ణయించారు. వరి ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని, అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షల పంట రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో బీఆర్‌ఎస్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ మాజీ చైర్మన్ నేరెళ్ల సుమన్ గౌడ్, నాయకులు ముక్క వెంకటేశ్, మెరుగు రాజేశం, రామచంద్రం, జితేందర్, మల్లేశ్, మహేందర్, శేఖర్, రాజేశ్, రవీందర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కలు బాబోయ్ !

పెగడపల్లి, నవంబర్ 3: పెగడపల్లి మండలంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లపై సంచరిస్తూ పాదచారులు, వాహనదారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆరవల్లి బస్టాండ్ ప్రాంతంలో ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు



కథలాపూర్: చింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, తదితరులు



సారంగాపూర్: రేచపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- **మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి**
- **కథలాపూర్, సారంగాపూర్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

కథలాపూర్, నవంబర్ 3: సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సూచించారు. కథలాపూర్ మండలం చింతకుంట, రాజారాం తండా, దుంపేట, పోసానిపేట, ఇప్పపెల్లి, కలికోట, అంబారిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక బాపురెడ్డి మాట్లాడుతూ, రైతులు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఉశకోల అరుణ్, మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీటీసీ బొడ్డు బాలు, నాయకులు బద్దం మహేందర్‌రెడ్డి, బైర మల్లేశ్, లోక నర్సారెడ్డి, వంచె రాజు, చీటి విద్యాసాగర్‌రావు, గోపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సంఘం చైర్మన్, నాయకులు

సారంగాపూర్, నవంబర్ 3: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి కోరారు. రేచపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మాజీ ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మేడిపెల్లి మనోహర్ రెడ్డి, భుక్యా సరళ, మాజీ సర్పంచులు ఎడమల జయ–లక్ష్మారెడ్డి, మోత్కూరి ప్రసాద్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు ఎండీ ఇబ్రహీం, భుక్యా లావణ్య–రాథోడ్, నర్సింహా రెడ్డి, సుధాకర్ రెడ్డి, మైపాల్ రెడ్డి, ఆశాది రాజన్న, సుదర్శన్, తిరుపతి రెడ్డి, బేర మహేశ్, బుచ్చి గంగన్న, మల్లేశం, సతీశ్, నిర్వాహకులు మల్లికార్జున్, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో లచ్చక్కపేట, నాగునూర్, ఒడ్డెరకాలనీ, రంగపేట, ధర్మనాయక్ తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సహకార సంఘం చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ పల్లపు బాపురాజు, డైరెక్టర్లు చిట్నేని దామోదర్ రావు, పన్నాల మోహన్ రెడ్డి, సీఈవో శివకుమార్, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

## వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబర్ 3: కార్తీక మాసం రెండో రోజైన ఆదివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మొదట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి మేళతాళాల మధ్య గోదావరి నది వరకు పండితులు, అర్చకులు, భక్తులు శోభాయాత్రగా చేరుకున్నారు. గోదావరి పుష్కరఘాట్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద పండితులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, భక్తులతో కలిసి గోదావరి నదికి హారతిఇచ్చారు. నదిలో కార్తీక దీపాలను వదిలి భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జువ్వాడి సూర్యారావుకు కన్నీటి వీడ్కోలు

ధర్మపురి రూరల్, నవంబర్ 3: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ వైస్ ఎంపీపీ జువ్వాడి సూర్యారావు అంత్యక్రియలను ఆదివారం ఆయన స్వగ్రామం ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో నిర్వహించారు. సూర్యారావు పార్థివ దేహాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎస్‌ఎఫ్‌సీ మాజీ చైర్మన్ రాజేశం గౌడ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు సందర్శించి, పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



సూర్యారావు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

